

నీ కోసం జీవిస్తే... నీలోనే జీవిస్తావు.. జనం కోసం జీవిస్తే జనహృదయంలో నిలిచిపోతావు.

- డా. బి. ఆర్ అంబేద్కర్

# జనస్వరం

అక్షరమే ఆయుధం ✍

www. Janaswaram.com


**పాఠకులకు విజ్ఞప్తి :**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రికలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పబ్లిసిటీ కొరకు అడ్వర్టయిజ్మెంట్ జన్మదిన శుభాకాంక్షలతో పాటు మరియు ఇతర అన్ని రకముల కార్య క్రమాలతో వగైరా ప్రకటనలు ఇవ్వండి. మరిన్ని వివరములకు మా మెయిల్ ఐడి janaswaramnews@gmail.com ను సంప్రదించండి.



సంపుటి : 01 | సంచిక : 26 | ఎడిటర్ : నరేష్ సాకే | వారసంచిక ( 03-01-2021 ) | పేజీలు : 6

/ janaswaramNEWS / 9642067900


## దివీస్ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని తూర్పు గోదావరి జిల్లా ఎస్పీకి వినతి పత్రాన్ని అందించిన రైతులు, జనసేన నాయకులు



తూర్పుగోదావరి ( జనస్వరం ) : జిల్లా పోలీస్ అధికారి (SP) వారిని జనసేన పార్టీ PAC సభ్యులు పంతం నానాజీ గారి ఆధ్వర్యంలో తొండంగి మండలం కొత్తపాకల, పంబదిపేట గ్రామస్తులు, రైతులు కలిసి వినతి పత్రం అందించారు. మా వాళ్ళ పై అక్రమంగా పెట్టిన కేసులు, గ్రామాల్లో సెక్షన్ 144, 30 లను తీసివేయాలని కోరారు. దివిస్ యాజమాన్యం వారిపై తొండంగి పోలీస్ స్టేషన్ లో మేము ఇచ్చిన కంప్లైంట్ పై FIR ఫైల్ చేసి వారిని అరెస్ట్ చేయాలనీ కోరారు. కోర్ట్ స్టే న్న నిర్మాణం చేస్తూనే ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## బడ్జెట్ సమావేశాల్లోపు రైతులకు రూ.35 వేలు పరిహారం చెల్లించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తాం.

వాలంటీర్ వ్యవస్థతో ఏం సాధించారు?     వకీల్ సాబ్ చెప్పాడని చెప్పండి



న్యూస్ ( జనస్వరం ) : నివర్ తుపాన్ వల్ల నష్టపోయిన రైతాంగానికి వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలోపు రూ. 35 వేలు పరిహారం చెల్లించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కల్యాణ్ గారు ప్రకటించారు. శాసనసభ సమావేశాలను విజయవాడలో పెట్టినా, విశాఖపట్నంలో పెట్టినా, చివరకు పులివెందులలో పెట్టినా వేలాది మంది రైతులు, నిరుద్యోగ యువతతో వచ్చి అడ్డుకొని తీరుతామని స్పష్టం చేశారు. రాష్ట్రం ఎందుకు అభివృద్ధి చెందదో, యువతకు ఎందుకు ఉద్యోగాలు ఇవ్వరో, రైతులకు ఎందుకు న్యాయం చేయరో అసెంబ్లీ ముందే తేల్చుకుంటామని అన్నారు. సోమవారం మధ్యాహ్నం కృష్ణా జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం సమర్పించే ముందు మచిలీపట్నంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ( మిగతా 3 లో )

## జనసేనానిని విమర్శించే అర్హత వైసీపీ పార్టీకి లేదు : జనసేన నాయకులు చిలకం మధుసూధన్‌రెడ్డి




అనంతపురం ( జనస్వరం ) : జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను విమర్శించే అర్హత వైసీపీ ముఖ్యమంత్రికి గాని లేదు. రైతుల కోసం జనసేన అధ్యక్షుడు పోరాడుతుంటే వైసీపీ మంత్రులు ఆళ్లనాని, పేర్ని నానీలు విమర్శలు చేస్తున్నారు. రూ. 937 కోట్లు ఇన్‌పుట్ సబ్సీడిని రిలీజ్ చేస్తామని తర్వాత మాట మార్చి 637 కోట్లు మాత్రమే ఇస్తున్నారన్నారు. రైతులకు వెంటనే పంట నష్ట పరిహారం, పంటల, భీమా ఇవ్వకపోతే అసెంబ్లీని ముట్టడి స్తామని జనసేన PAC సభ్యులు చిలకం మధుసూధన్‌రెడ్డి, రాయలసీమ సంయుక్త కన్వీనర్ టిసి వరుణ్‌లు పేర్కొ న్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా చిలకం మధుసూధన్‌రెడ్డి ( వివరాలు 4 లో )

## వాలంటీర్లకు ఇళ్ళ పట్టాలు ఎలా ఇస్తారు ? : నర్సీపట్నం ఇంచార్జ్ రాజాన వీరసూర్య చంద్ర



నర్సీపట్నం ( జనస్వరం ) : వాలంటీర్లకు ఇళ్ళ పట్టాలు ఎంత వరకూ సమంజసమని జనసేన పార్టీ నర్సిపట్నం నియోజకవర్గ ఇంచార్జ్ రాజాన వీర సూర్యచంద్ర ఆరోపించారు. నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాలంటీర్లు ప్రభుత్వ ఉద్యోగులని చెప్పి వారికి ఎలా ఇళ్ళ పట్టాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇళ్ళ స్థలాల ఎంపికలో భారీ అవినీతి చోటు చేసుకుందన్నారు. ఎక్కువ శాతం అర్హుల జాబితాలో వాలంటీర్స్ కు చోటు కల్పించారని, అంటే కాకుండా ఇంటి పన్ను కడుతున్న వారి పేరు కూడా అర్హుల జాబితాల పేరులో ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారి పేర్లు కూడా ఉన్నాయన్నారు. అంతే కాకుండా అణగారిన వర్గాలైన ఎస్సీ వర్గానికి చెందిన వారికి ఇవ్వకుండా స్థానిక వైసీపీ నాయకుల ఒత్తిడి తీసుకువచ్చి కనీస విచారణ చేయకుండా గ్రామసభ పెట్టకుండా గ్రామ సభ కూడా పెట్టకుండా అర్హులని ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. వాలంటీర్ ద్వారా డబ్బులు అడుగున పరిస్థితి ఉందన్నారు. ముఖ్యంగా నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామంలో ఈ దందా ఎక్కువ నడుస్తుందన్నారు. మా పేరు ఎందుకు తొలగించారని అడిగితే మీకు దిక్కు ఉన్న చోట సమాధానం చెప్పుకొండని సమాధానం ఇస్తున్న రెవెన్యూ అధికారులపై తక్షణం విచారణ జరిపాలన్నారు. అలాగే ఆ గ్రామంలో అనర్హుల జాబితా తొలగించి, అర్హులైన జాబితా వారికి ఇళ్ళు పట్టాలని ఇవాలని కోరారు. అంతేకాకుండా ఫ్యాక్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ గారికి కంప్లైంట్ చేస్తున్నాము విచారణ చేయని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు నర్సీపట్నం గ్రామీణ అధ్యక్షుడు :ఊడి చక్రవర్తి, మోపాడ చిరంజీవి, పరవాడ లోవరాజు ఇన్న, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ అసమర్థ పాలన ఎక్కువ రోజులు కొనసాగదు : అనకాపల్లి ఇంచార్జ్ పరుచూరి భాస్కరరావు



విశాఖపట్నం ( జనస్వరం ) : అనకాపల్లి పార్టీ కార్యాలయంలో ఇంచార్జ్ పరుచూరి భాస్కరరావు గారు మాట్లాడుతూ.. నివర్ తుఫాను వలన నష్టపోయిన రైతులకు ఎకరాకు 35000 చెల్లించాలని, లేకుంటే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో త్వరలో అసెంబ్లీ ముట్టడి చేస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా హిందూ దేవాలయాల భద్రత లేదని, రథం కాల్చివేత విగ్రహాల ధ్వంసం జరుగుతుందని, మద్యనిషేధం చేస్తామని గెలిచిన ప్రభుత్వం రెట్టింపు ధరలతో మద్య ఆంధ్ర ప్రదేశ్ గా మార్చారు అని తెలియజేశారు. అప్పు చేసి పప్పు కూడు తప్ప, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కరువయ్యాయి అని తెలిపారు. సామాన్య మధ్య తరగతి ప్రజల నడి విరుసుతున్నారని తెలిపారు. అనకాపల్లి ఈ స్థలాలను స్థానికులు కేటాయించాలని విశాఖ ప్రాంత ప్రజలకు ఇచ్చి స్థానికులు అన్యాయం చేయొద్దని హితవు పలికారు. రోడ్లు సరిగ్గా లేని కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే ప్రభుత్వ అధికారులు, స్థానిక నాయకులు స్పందించాలని కోరారు. కొంత మంది వైఎస్ఆర్సీపి నాయకులు సభ్య సమాజం తలదించుకునే లాగా భాషను ఉపయోగిస్తున్నారని.. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంతమంది పవన్ కళ్యాణ్ రెండు చోట్ల ఓడిపోయారని విమర్శిస్తున్నారు. వారి పార్టీ గౌరవ అధ్యక్షురాలు విజయమ్మ విశాఖపట్నంలో ఓడిపోయారని దానికి సమాధానం ఏమిటని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో భవిష్యత్తు జనసేనని, పవన్ కళ్యాణ్ గారు మిగతా రాజకీయ నాయకుల్లాగా అవినీతి సంపాదన లేదని పార్టీ నడపడానికి కొన్ని సినిమాలు నటిస్తున్నారని తెలిపారు. ఈ రోజు గ్రామ కమిటీలు ప్రకటించడం జరిగింది. త్వరలో మండల వార్డు కమిటీలు ప్రకటిస్తాం. ఫిబ్రవరి నుండి గ్రామ స్థాయి నుండి పార్టీని మరింత బలపరుస్తామని పరుచూరి భాస్కర్ గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేల నూకరాజు, రాము తాడి రామకృష్ణ, గెంజి సత్యారావు కామరాజు, మంగా ఈశ్వర్, తాకాసి సత్యందోర, దూలం గోపి, కొడుకుల శ్రీకాం,త్ అప్పికొండ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# ప్రభుత్వ అనాలోచిత చర్యలు, మొండి వైఖరి, న్యాయస్థానాల అక్షింతలు

" మొండివాడు రాజుకన్నా బలవంతుడు అనేది సామెత. అదే మొండివాడే రాజయితే? "

ప్రజాస్వామ్యంలో ఏ పార్టీకి సంపూర్ణ ఆధిపత్యం రాకూడదేమో! ఒకవేళ వచ్చినా చట్టసభలలో బలమైన ప్రతిపక్షం తప్పనిసరిగా వుండి తీరాలి, లేకపోతే ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ లాగే తయారవుతుంది.

2019 లో గా| శ్రీ జగన్మోహన్ రెడ్డి గారు ప్రభుత్వం ఏర్పాటు చేశాక అందరినీ ఆకర్షించింది ఆయన నియమించిన ప్రభుత్వ సలహాదారులు. అత్యధిక మొత్తంలో గౌరవ వేతనాలు ఇచ్చి పెద్ద సంఖ్యలో నియమించిన సలహాదారులు ప్రభుత్వాన్ని సరైన దిశలో నడిపించడంలో ప్రముఖ పాత్ర వహిస్తారు అని అందరూ ఆశించారు.

అయితే ఓం ప్రధమంగా ఈ ప్రభుత్వం చేసిన పని ఏంటంటే, మునుపటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ప్రజావేదిక' అనే కట్టడాన్ని కూల్చివేయడం. విమర్శలు ఎదురైనా సరే కృష్ణా నది కరకట్టపైన వున్న అక్రమ కట్టడాలని సమూలంగా నిర్మూలించి ఓ క్రొత్త వొరవడికి శ్రీకారం చుడుతున్నారని అందరూ ఆనందపడ్డారు. తీరా చూస్తే ఆ ఒక్కటీ తప్ప ఈనాటి వరకూ మరో కట్టడం కదపలేదు. గత పాలకులపై వ్యక్తిగత పగలే తప్ప చిత్తశుద్ధి లేదన్న విమర్శలు వచ్చాయి. అనుభవజ్ఞులు, మేధావులు, వివిధ రంగాల నిపుణులు సలహాదారులుగా వుండి యిలాంటి పనులు ఎలాచేస్తున్నారు అనే వ్యాఖ్యలూ వినవచ్చాయి.

అయితే అక్కడితో ఆగలేదు, ఈ ప్రభుత్వం చేసే అవకతవక పనులని కొందరు కోర్టుకి వెళ్లి ఆపగలిగారు, కొన్నిసార్లు కోర్టులే స్వయంగా కలుగజేసుకొని నివారించాయి. ముప్పయి మందికి పైగా సలహాదారులని నియమించి వారికి నెలనెలా కోట్లాది రూపాయలు ప్రజాధనాన్ని చెల్లిస్తున్న ప్రభుత్వం, ఈ ఏణ్ణర్ధంగా చూసుకుంటే నూటికి పైచిలుకు సార్లు కోర్టులతో మొట్టికాయలు తినడం అనేది దేశంలోనే ప్రప్రధమం. ప్రతీ సందర్భాన్ని ప్రస్తావించడం కుదరదు కనుక కొన్ని ముఖ్యమైన అంశాల్లో ప్రభుత్వ మూర్ఖ మొండి వైఖరి పరిశీలిద్దాం.

### 1. ప్రభుత్వ ప్రజా ఆస్తులకి పార్టీ రంగులు వేయడం :

గతంలో కొన్ని ప్రభుత్వాలు తమ పార్టీ రంగులని స్ఫూరించేలాగా కొన్ని కొన్ని చోట్ల రంగులేయించుకొనేవారు. తెలుగుదేశం ప్రభుత్వంలో వాటర్ ట్యాంకులు, అన్నా కాంటీనులు లాంటివి ఈ విషయంలో విమర్శలకు గురైనాయి. ఈ ప్రభుత్వం వారు, ప్రభుత్వ కార్యాలయాలు మొదలుకొని గాంధీ విగ్రహాలకు, స్కూళ్లకు, స్మశానాలకు, ఆఖరికి చెత్త కుప్పలకు కూడా తమ పార్టీ రంగులు పులిమేశారు. అడిగిన ప్రతీవారిని గత ప్రభుత్వం ఇదే పని చేస్తే ఎందుకు అడగలేదు అని ఎదురుదాడి చేశారు.

ఈ చర్యను వ్యతిరేకిస్తూ సామజిక వుద్యమకారుడు, రైతు ముప్పా వెంకటేశ్వర రావు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ రంగులు వేయడానికి దాదాపు 1300 కోట్లు ఖర్చుయ్యాయని ఒక అంచనా. కోర్టు ప్రశ్నలకు జవాబిస్తూ అదనపు అడ్వొకేట్ జనరల్ సుధాకర్ రెడ్డి గత ప్రభుత్వం 'అన్న కాంటీన్ల'కు, పల్లపాడు పంచాయితీ భవనానికి పసుపు రంగు వేశారని తెలిపారు. ధర్మాసనం ఈ విషయంపై తుది తీర్పు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వాన్ని పదిరోజుల్లో రంగులు తొలగించాలని, రాజకీయ పార్టీల రంగులు ప్రభుత్వ కార్యాలయాలకు వేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.



ప్రభుత్వ పెద్దలు హైకోర్టు ఆదేశాలను వ్యతిరేకిస్తూ అవే రంగులని ఆమోదించాలని సుప్రీం కోర్టుకు వెళ్లారు. బెంచ్ లో వున్న న్యాయమూర్తి నాగేశ్వరరావు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను వుద్దేశించి, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలన్నిటికీ కాషాయ రంగు వేయడానికి అనుమతిస్తారా అని ప్రశ్నించారు. తుషార్ మెహతా అటువంటివేమీ చేయబోమని తెలిపారు. మరి రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అటువంటిపని ఎలాచేస్తుందని వాఖ్యానించి ఆ పిటిషన్ ను కొట్టివేశారు.

తదుపరి పరిణామాలలో ఇంకొక రంగుని జతచేసి ఇప్పుడు పార్టీ రంగులు కావు అని మభ్య పెట్టే ప్రయత్నం చేసింది రాష్ట్ర ప్రభుత్వం. ఈ ఆదేశాల్ని మరొక్కసారి హైకోర్టు కొట్టేసింది, ప్రభుత్వం ఇంకోసారి సుప్రీం కోర్టుకి వెళితే అక్షింతలు వేసి నాలుగువారాల్లో తొలగించాలని జూన్ లో ఆదేశించింది. కట్ చేస్తే ఈ రోజుకీ వార్డు సచివాలయాలకి, ఇతర కార్యాలయాలకి అవే రంగులు చూడవచ్చు. ఎవరేమన్నా ఎంత ఛీత్కరించినా మొండిగా సిగ్గూ లజ్జా వదిలేసి ప్రవర్తించడం ఖచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టకి భంగమే.

### ౨. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం తొలగించడం:

2004 లో యునెస్కో వారు విడుదల చేసిన రిపోర్టులో ప్రాధమిక విద్యాభ్యాసం పిల్లల మాతృభాషలో చేస్తే వారి మేధోవికాసం, అవగాహనాశక్తి మరింత మెరుగ్గా వుంటాయని తెలిపారు. మన దేశంలో కొన్ని దశాబ్దాల క్రితం వరకూ ప్రైవేటు స్కూళ్లలో కూడా తెలుగు మాధ్యమం వుండేది. దురదృష్టవశాత్తూ యిప్పుడు కనబడడంలేదు. మనకున్న పరాయిభాషాభిమానం కారణంగా ఇంగ్లీషు అనేది అవసరానికంటే కూడా హోదాకి, దురహంకారానికీ చిహ్నంగా మారిపోయింది. ప్రపంచంలో అభివృద్ధి చెందిన సంపన్న దేశాలలో చాలావరకు విద్యాభ్యాసం తమ మాతృభాషలోనే జరుగుతుంది. ఉదాహరణకి చైనా, జపాన్, కొరియా, ఫ్రాన్స్, జర్మనీ, రష్యా మొదలైన దేశాలలో ఉన్నత విద్యాభ్యాసం కూడా వారి మాతృభాషలోనే జరుగుతుంది. అంతెందుకు ఉత్తరాది విద్యార్థులు సివిల్స్ పరీక్షలు తమ మాతృభాషలో వ్రాసి విజయం సాధించడం సర్వ సాధారణం.

గత తెలుగుదేశం ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెట్టి విమర్శలు ఎదుర్కొన్నారు. ఇప్పుడు అధికారంలో వున్న వైకాపా వారు అప్పట్లో పెద్ద ఎత్తున గొడవ చేసి తమ మౌత్ పీస్ సాక్షిలో ఇంగ్లీషు మీడియం వలన విద్యార్ధులకి జరిగే నష్టంపై ప్రచారం చేశారు. కానీ తాము అధికారంలోకి రాగానే మొత్తం అన్ని పాఠశాలల్లో తెలుగుమీడియంను తొలగించి ఇంగ్లీషు మీడియం పెట్టేశారు. తలిదండ్రుల్లో ఎక్కువమందికి ఇంగ్లీషు మాధ్యమం అంటే మోజున్న మాట వాత్సవం. కానీ తెలుగు మీడియంలోనే చదవాలనుకుంటున్న విద్యార్థుల్ని, వారి తలిదండ్రుల్ని బలవంతంగా ఇంగ్లీషులోకి నెట్టకండి అని మేధావులు, రాజకీయా వేత్తలు, విద్యావంతులు, తలిదండ్రులు చేస్తున్న వేడికోళ్ళని ప్రభుత్వం పెడచెవిన పెట్టింది.

పైగా మీపిల్లలు ఏ మీడియంలో చదువుతున్నారు? అంటూ అర్ధం లేని యెదురు దాడికి తెగబడింది. సాక్షాత్తూ ముఖ్యమంత్రే ఆ రకంగా వితండవాదం చేయడం బాధాకరం. ఏ మాధ్యమంలో చదువుకోవాలో విద్యార్థులూ వారి తలిదండ్రులూ నిర్ణయించుకోవాలిగానీ జగనో పవనో కాదు అన్న ఇంగితం కరువైపోయింది. అధినేత నుండీ వారి సోషల్ మీడియా ప్రతినిధులవరకూ అడిగిన ప్రతి ఒక్కరిపైనా వ్యక్తిగత దాడులకి వ్యక్తిత్వ హననానికీ పాల్పడ్డారు. ఇదే విషయం పై గత ప్రభుత్వంమీద తీవ్ర విమర్శలు చేసిన బాషా సంఘం అధ్యక్షుడు ఇప్పటి ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించడం అత్యంత విచారకరం.

కాగా యధావిధిగా కోర్టు ఈ నిర్ణయాన్ని సస్పెండ్ చేసింది. ప్రభుత్వం అత్యుత్సాహంతో పుస్తకాలు ప్రచురించడం లాంటివి చేస్తే ఆ ఖర్చులు సంబంధిత అధికారినుంచి రికవరీ చేస్తాం అనికూడా హెచ్చరించింది. దీనికి బదులుగా తమ సాక్షిలో ప్రభుత్వం సర్వే చేసిందని ఒకసారి, ప్రైవేటు సంస్థతో సర్వే చేయించామని ఒకసారి ప్రజలు ఆంగ్ల మాధ్యమానికి అనుకూలంగా వున్నారని నమ్మశక్యం కాని అంకెలతో ప్రచారం చేసింది. కరోనా లాక్ డౌన్ లో సర్వేలు ఎవరు ఎక్కడ చేసారు అంటే సమాధానము వుండదు.

ఇక్కడ మరొక్క ఇబ్బందికరమైన విషయం ఏంటంటే ఇప్పటివరకూ వున్న ఉపాధ్యాయులు తమ కెరియర్ అంతా తెలుగు మాధ్యమంలోనే బోధన చేశారు. వారిలో అత్యధికులు తెలుగు మీడియంలోనే చదువుకున్నవారు. వారిని వున్నపాటుగా కొద్దిపాటి ట్రైనింగ్ యిప్పించి ఆంగ్లంలో చదువు చెప్పమంటే ఏం చెబుతారు? కొత్తగా ఒక్కరిని కూడా ఇంగ్లీషు మాధ్యమంలో బోధించడానికి నియమించకుండా యెలా కానిచేద్దామనుకుంటున్నారు అంటే ప్రభుత్వం దగ్గర సమాధానం వుండదు. ఇప్పటికీ కొన్ని ప్రైవేటు స్కూళ్లలో ఇంగ్లీషు మీడియంలో చదువుకొని అటు తెలుగూ ఇటు ఇంగ్లీషూ రెండూ సరిగా రానివారిని చూస్తున్నాం.ప్రాక్టికల్గా ఇన్ని ఇబ్బందులున్నా ప్రభువులు మూర్ఖంగా మొండిగా ముందుకే పోతున్నారు. భువులు మూర్ఖంగా మొండిగా ముందుకే పోతున్నారు.

### 3. స్థానిక సంస్థల ఎన్నికలు :

గతేడాది రాష్ట్ర ఎలక్షన్ కమీషనర్ రమేష్ కుమార్ స్థానిక సంస్థల ఎలెక్షన్లకి నోటిఫికేషన్ జారీచేసిప్రక్రియమొదలుపెట్టారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థానాలూ ఏకగ్రీవంగా అధికారపార్టీకే రావాలని జగన్ రెడ్డి తమ పార్టీ శ్రేణులను ఆదేశించారు. రాష్ట్రం మొత్తం చూస్తుండగానే కిడ్నాపులు చేసి, బెదిరించి, నామినేషన్ పత్రాలు ఎత్తుకుపోయి, కొన్నిచోట్ల కొట్టి మరీ ఇంకెవరినీ నిలబడనీయకుండా ఏకగ్రీవాలు చేసిన విషయం అందరికీ తెలిసిందే. ప్రముఖ పర్యావరణ వేత్త, జనసేన ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్య వంటివారు ప్రత్యక్షంగా చూసి ఫిర్యాదు చేసినా ఉపయోగం లేక పోయింది. SEC కూడా ఈ ఫిర్యాదులని పట్టించుకోలేదు.

ఈ నేపథ్యంలో కొరోనా ప్రబలడం దేశవ్యాప్తంగా ప్రధాని లాక్ డౌన్ ప్రకటించడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఎన్నికల కమిషన్ అధికారి వీటిని దృష్టిలో వుంచుకొని ఎన్నికలని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం అధికార పార్టీవారికి నచ్చలేదు. బహుశా కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ప్రత్యర్ధులని భయపెట్టి సాధించుకున్న ఏకగ్రీవాలు పోతాయనేమో.

మొదటగా ముఖ్యమంత్రి ఎన్నికల సంఘంపై యుద్ధం ప్రకటించారు. SEC కులాన్ని లాగి ప్రతిపక్ష నాయకుడితో సంబంధం అంటగట్టి బురద చల్లారు. ఎలెక్షన్లు పూర్తి చేసేయవచ్చు కొరోనా భయం లేదు అని వాదించారు. పైపెచ్చు SEC అధికారాలపైనా ఆరా తీశారు. తాను అత్యధిక మెజారిటీతో గెలిచిన ముఖ్యమంత్రిని నాకువిలువ లేదా అని బాధపడ్డారు. షరా మామూలుగానే కోర్టులకెక్కారు, అక్షింతలు వేయించుకున్నారు.

ఇవి మచ్చుకి కొన్ని మాత్రమే. ఇలా ఎన్నో విషయాలలో మొండిగా మూర్ఖంగా ఎవరేమనుకున్నా ఫర్వాలేదనే ధోరణిలో ఈ ప్రభుత్వ పెద్దలు వ్యవహరిస్తున్నారు. ఇలా యెంతకాలం జరుగుతుందో చూడాలి అని ప్రజలు అనుకుంటున్నారు.

By
శ్రీకాంత్
ట్విట్టర్ ఐడి : @sree_n_r

## బడ్జెట్ సమావేశాల్లోపు రైతులకు రూ.35 వేలు పరిహారం చెల్లించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తాం

ఛైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ గారు పాల్గొన్నారు. మచిలీపట్నం వేదికగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ... "నివర్ తుపాన్ వల్ల నష్టపోయిన రైతుల కన్నీరు తుడవటానికి రోడ్లు మీదకు వస్తే వైసీపీ నాయకులు రాజకీయం చేస్తున్నాం అంటున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం, చర్చించడం, రోడ్ల మీదకు వచ్చి శాంతియుతంగా నిరసన తెలపడం ఎలాగైతే ఒక భాగమో... కలెక్టరేట్ లో వినతిపత్రం సమర్పించడం అనేది కూడా నిరసన తెలియజేయడంలో ఒక భాగం. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన హక్కు. రాష్ట్ర ఖజానాకు వచ్చిన ప్రతి 100 రూపాయల్లో 40 రూపాయలు రైతుల నుంచే వస్తోంది. దాదాపు 9 లక్షలకోట్లు పైచిలుకు స్థూల ఉత్పత్తి ఆదాయం అయితే దాంట్లో రూ. 3లక్షల 30వేల కోట్లకు పైగా కేవలం వ్యవసాయం మీదే వస్తుంది. అలాంటి రైతాంగం ఒకే ఏడాదిలో మూడు తుపాన్లకు చిన్నాభిన్నమై అప్పులపాలై ఏడుస్తుంటే కన్నీరు తుడవటానికి కచ్చితంగా రోడ్ల మీదకు వస్తాం.

తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ గారు దాదాపు 58 లక్షల మంది రైతులకు రైతు బంధు పథకాన్ని అమలు చేస్తున్నారు. పథకం కింద రూ.15వేల కోట్లు విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ లో 84 లక్షల మంది రైతులు ఉంటే 40 లక్షల మంది రైతులకే రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి, జగన్ రెడ్డి గారికి సత్సంబంధాలు ఉన్నాయి కదా... తెలంగాణ ప్రభుత్వాన్ని స్ఫూర్తిగా తీసుకొని కులం, మతం, ప్రాంతం అనే తారతమ్యాలు లేకుండా అందరి రైతులకు రైతు భరోసా పథకం అమలు చేయాలి. రాష్ట్ర రైతాంగంలో దాదాపు 70 శాతం మంది కౌలు రైతులే. వారికి భూమి హక్కు లేదు. ప్రతి యేటా పంట నష్టాలే. ఆ బాధతో ఆత్మహత్యలు చేసుకుంటే వారి తరపున మాట్లాడే వ్యక్తులు లేరు. గ్రామ వాలంటీర్ల ముందు తామే కౌలు రైతులమని నిరూపించుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ మాత్రం దానికి వాలంటీర్ల వ్యవస్థ పెట్టి ప్రయోజనం ఏంటి.? మీరు ఏం సాధించినట్లు? దారిలో వస్తూ రైతులతో మాట్లాడాను... కొత్త పంటలు వేసుకోవడానికి ప్రభుత్వం పెట్టుబడిగానీ, విత్తనాలుగానీ సరఫరా చేసిందా అని అడిగితే ఇవ్వలేదు అన్నారు. వాలిపోయిన పంటలు కొన్నారా అంటే కొనలేదు అని చెప్పారు. ఇన్ పుట్ సబ్సిడీ అయినా ఇచ్చారా అని అడిగితే అది కూడా ఇవ్వలేదని చెప్పారు.

ఒకవైపు ప్రధానమంత్రి గారు దాదాపు 9 కోట్ల మంది రైతులకు ప్రతి ఒక్కరికి రెండు వేలు చొప్పున రూ.18వేల కోట్లు వారి అకౌంట్లలో జమచేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎంత ఇవ్వబోతున్నారో ఇప్పటి వరకు ప్రకటించలేదు. అన్నంపెట్టే అన్నదాతకే అండగా నిలబడలేని మీ పార్టీకి 151 మంది ఎమ్మెల్యేలు ఉండి ఏం ప్రయోజనం? బ్లూ లైట్లు, పోలీసులను సెక్యూరిటీగా పెట్టుకొని కార్లలో తిరగడానికా? లేక ఇసుక, మద్యం, మైనింగ్ లో కోట్లు దోచేయడానికా?. నివర్ తుపాన్ వల్ల వరి రైతులతో పాటు మిర్చి, పసుపు, మినుములు, కంది, చెరకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారితోపాటు తీరంలో ఉంటున్న మత్స్యకారులు సైతం తుపాను వల్ల నష్టపోయారు. వారిని ఎలా ఆదుకుంటారో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ప్రజల పక్షానా ఏదైన మాట్లాడదాం అంటే వైసీపీ నాయకులు బూతులు తిడతారు. వైసీపీలో నానీలుఎక్కువ. శతకోటి లింగాల్లో బోడిలింగం అన్న చందంగా.. అనేకమంది నానిలో ఈయనొకరు. శతకోటి నానిల్లో ఒక నాని అయిన నానిగారు... మీ సీఎం సాబ్ కి వకీల్ సాబ్ చెప్పాడని చెప్పండి. నివర్ వల్ల నష్టపోయిన రైతులకు తక్షణమే రూ. 10 వేలు విడుదల చేయాలని, అలాగే వచ్చే అసెంబ్లీ సమావేశాల లోపు రూ. 35వేలు నష్టపరిహారం చెల్లించాలని చెప్పండి. లేనిపక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని చెప్పండి. అలాగే ఇప్పటి వరకు 15 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొని చనిపోయారు. రూ. 7 లక్షలు ఇచ్చారు. ఎల్జీ పాలిమర్స్ దుర్ఘటనలో చనిపోయిన వారికి కోటి రూపాయలు ఇప్పించి, రైతులకు మాత్రం రూ. 7 లక్షలు ఇవ్వడం సమంజసం కాదు. పెద్ద మనసు చేసుకొని నష్టపరిహారాన్ని పెంచండి. ఇసుక, మైనింగ్, మద్యం మాఫియాతో కోట్లు దోచుకుంటున్న ప్రజాప్రతినిధులు రైతుకి రూ. 10 వేలు ఇవ్వడానికి ఎందుకు ఆలోచిస్తున్నారో అర్థం కావడం లేదు. మా ప్రభుత్వం వస్తే సంపూర్ణ మద్యపాన నిషేధం అని చెప్పారు. మద్యంపై ఆదాయం అవసరమే లేదన్నారు. మద్యంపై ఒక ఏడాదికి రూ.17 వేల 500 కోట్ల ఆదాయం వస్తోంది. ఆ ఆదాయాన్ని ఒక ఏడాది వదులుకోని రైతులను ఆదుకోండి అంటే ప్రభుత్వం నుంచి స్పందన లేదు. పవన్ కళ్యాణ్ సినిమాలు చేసుకుంటూ ఖాళీ సమయాల్లో రాజకీయాలు చేస్తున్నాడని వైసీపీ నేతలు మాట్లాడుతున్నారు. వీళ్లంతా ఏమైనా దేశ సేవ చేస్తున్నారా? పాపం జగన్ రెడ్డి గారికి సిమెంట్ ఫ్యాక్టరీలు లేవు, మైనింగ్ వ్యాపారాలు లేవు, మీడియా సంస్థలు లేవు, వేలకోట్లు లేవు. వైసీపీ నాయకులు అందరూ గాంధీ మహాత్ముడిలా కేవలం చిన్న పంచె కట్టుకొని రోజు ప్రజల్లోతిరుగుతున్నారు. ఏ పని చేయకుండా కేవలం రాజకీయాలు కోసమే ఉంటే మీకు ఇన్ని ఫ్యాక్టరీలు, కాంట్రాక్టులు ఎందుకు.? మీ వ్యాపారాలు మీరు చేసుకుంటూ కోట్లు దోచుకోవచ్చు. మేము మాత్రం కష్టపడి పని చేసుకుంటూ ప్రజల కోసం రాజకీయాల్లోకి వస్తే మాత్రం ఖాళీ సమయంలో రాజకీయం చేస్తున్నామని అంటారా? మీరంతా ఖాళీ సమయంలో పేకాట ఆడుతూ.. పేకాట క్లబులు నడపొచ్చు. మేము మాత్రం రాజకీయాల్లోకి రాకూడదు. పేకాట కబ్లులు నడిపే మీరు కూడా మమ్మల్ని విమర్శిస్తే ఎలాగయ్య. వైసీపీ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడితే మీకు ఎలా సమాధానం చెప్పాలో నాకు బాగా తెలుసు. ఆ సత్తా నాకు ఉంది. చేప ముల్లు తీసినట్లు తీసేయగలను. ప్రజాస్వామ్యంలో రెచ్చగొట్టే రాజకీయం పద్ధతి కాదు. మీ పేపర్లు, కాంట్రాక్టులు, మద్యం షాపులు మూసుకొని రాజకీయాలు చేయండి అప్పుడు నేను కూడా సినిమాలు వదిలేసి రాజకీయాలు చేస్తాను. బూతులు తిడితే నోరు మూసుకొని ఇళ్లల్లో కూర్చుంటాం అనుకోకండి. ఎక్కువ మాట్లాడితే మీ ఇళ్లముందుకు వస్తాం. నోరు మీ ఒక్కరికే కాదు అందరికి ఉంది. పవన్ కళ్యాణ్ ను తిడితే మంత్రి పదవి పదిలంగా ఉంటుంది అంటే తిట్టండి. కానీ రైతులకు మాత్రం న్యాయం చేయండి. రాజకీయం ఒక్కరి సొత్తో, ఒక కుటుంబం సొత్తో, ఒక కులం సోత్తో కాదు. అన్ని కులాలు, మతాలకు సమాన అవకాశాలు ఉండాలని కోరుకునే వ్యక్తులం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 84 లక్షల రైతు కుటుంబాలకు జనసేన పార్టీ అండగా ఉంటుందని, వారు కన్నీరు తుడిచే బాధ్యత జనసేన తీసుకుంటుందని" అన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ శ్రీ బండి రామకృష్ణ, పార్టీ నాయకుడు శ్రీ బంద్రెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జనసేనాని స్ఫూర్తితో విదేశాల్లో జనసైనికుల జనసేవ కార్యక్రమాలు




న్యూస్ ( జనస్వరం ) : అమెరికాలో డిసెంబర్ 23 నుండి 31 వరకూ USA లోని పలు రాష్ట్రాలలో ఆహార వితరణ కార్యక్రమం చేసిన NRI జనసైనికుల బృందం. ఖండాంతరాలు దాటినా జనసేవ కార్యక్రమాలను మర్చిపోలేదు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎంపిడిఓ కు వినతి పత్రాన్ని అందించిన కుప్పం జనసేన నాయకులు



కుప్పం ( జనస్వరం ) : రామకుప్పం మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలలో త్రాగునీటి సమస్య ముఖ్యమైనది. ఇందుకు కారణంగా మండలంలోని 17 పంచాయతీలలో గల గ్రామాలలో ఎక్కడైతే నీటి సమస్య ఉందో అదేవిధంగా వాటర్ ట్యాంక్ మరమ్మత్తులు జరపాలని ప్రతి రెండు ఇళ్లకు ఒక కుళాయి అమర్చాలని స్థానిక జనసేన నాయకులు ఎంపిడిఓ కు వినతి పత్రాన్ని అందించారు. పాడుబడ్డ బోర్లను మరమ్మత్తులు చేయించాలని కోరారు. ప్రభుత్వం వచ్చి దాదాపుగా 2 సంవత్సరాలు అయినా త్రాగునీటి సమస్యను పరిష్కరించకపోవడం దారుణం అన్నారు. వీలయినంత త్వరగా సమస్యను పరిష్కరించాలని, లేకపోతే ధర్నాకు దిగుతామని జనసేన నాయకులు హెచ్చరించారు.

## జిల్లాకి ఇచ్చిన హామీలు మరచిపోయారా సీయం గారు ??? : త్యాడ రామకృష్ణ రావు( బాలు)



విజయనగరం ( జనస్వరం ) : గతంలో మీరుచేపట్టిన పాదయాత్ర సమయంలో మీరు జిల్లాకి ఇచ్చిన హామీలు మర్చిపోయారా సిఎం గారు? అని జనసేన పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు త్యాడ రామకృష్ణారావు(బాలు) ప్రశ్నించారు. జిల్లాలో ముఖ్యమంత్రి బుధవారం పర్యటన దృష్ట్యా గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చని నేపథ్యంలో జనసేన నాయకులు బాలు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం స్థానిక ఆర్. టి.సి.కాంప్లెక్స్ వద్ద శాంతియుతంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బాలు మీడియాతో మాట్లాడుతూ గతంలో పాదయాత్ర సమయంలోను మరియు ఎన్నికలముందు జిల్లాలో మూతపడిన పరిశ్రమలు తెరిపిస్తానని, వైద్యకళాశాల, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు, మీకు ఎంతో ప్రతిష్టాత్మకమైన నవరత్నాల్లో భాగమైన మద్యపాన నిషేధం అని, జిల్లాలో సాగునీరు, త్రాగునీరు పెండింగ్ ప్రాజెక్టులను అభివృద్ధి పనులు మొదలైన హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే హామీలను తుంగలో తొక్కి జిల్లా ప్రజలకు వెన్నుచూపారు. మాటతప్పను, మడమ తిప్పను, అన్న మాటకు అర్థం ఇదేనా? నేను విన్నాను, నేను ఉన్నాను అనేమాటకు అర్థం ఇదేనా ముఖ్యమంత్రి గారు అని దుయ్యబట్టారు. మంత్రి బొత్స సత్యనారాయణ మరియు డిప్యూటీ సిఎం పాముల పుష్పశ్రీ వాణి ఈ మధ్య చీపురుపల్లి, కురుపాం నియోజకవర్గాల్లో ఇంటిపత్రాలు, ఇండ్లస్థలాలు ఇచ్చినప్పుడు అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేశామని ఢంకామోగించారు. జనసేన పార్టీనుంచి మేము ఒక్కటే మంత్రులకు చెప్పదలిచ్చాం.. వైస్సార్సీపీ కార్యకర్తలకు మంజూరు ఐతే అర్హులైన పేదలకు మంజూరు కానట్టేనని, ఎంతోమంది పేదలు అమ్మఒడి పథకం, ఇండ్లు మరియు ఇండ్లస్థలాలు కేటాయించిన వారికి కక్షసాధింపుగా వారందరికీ తొలగించారని, వారందరికీ మంజూరు ఐనంతవరకు జనసేన పార్టీ పోరాడుతుందని అన్నారు. గతంలో హామీలు ఇచ్చి ఇపుడు అధికారంలోకి వచ్చాక ఆ హామీలను తుంగలోకి తొక్కారని విజయనగర జనసేన నాయకులు, జనసైనికులు అన్నారు.

## జనసేనానిని విమర్శించే అర్హత వైసీపీ పార్టీకి లేదు : జనసేన నాయకులు చిలకం మధుసూధన్‌రెడ్డి

( మొదటి పేజీ తరువాయి )

మాట్లాడుతూ... రాష్ట్రంలో రాష్ట్రంలో 17 లక్షల మంది రైతులు నష్టపోయారని వారే మొదట చెప్పడం జరిగిందన్నారు. తర్వాత క్యాబినెట్‌లో 13 లక్షల మంది రైతులు అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయారని చెప్పడం జరిగిందన్నారు. తర్వాత అసెంబ్లీలో 11 లక్షల మంది రైతులు పంట దెబ్బతినిందని లెక్కలు తేల్చారని ఒక్కోసారి ఒక్కో మాట' "మాట్లాడటం చేస్తుంటే రైతుల పట్ల వీరికి ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతోందన్నారు. వైసీపీ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. వైసీపీ నాయకులు ఢిల్లీకి వెళ్లి తమకు సహాయం చేయాలని ప్రధానిని కోరి తర్వాత ఆంధ్రప్రదేశ్ వచ్చినపుడు సహాయం చేయలేదని విమర్శించడం తగదన్నారు. రాయలసీమ సంయుక్త కన్వీ నర్ టి.సి.వరుణ్ మాట్లాడుతూ... పేర్నినాని, కొడాలి నానిలు మాట తీరు సరిగ్గా లేదని మాటలు సరిగా మాట్లాడకపోతే తాము కూడా బూతు పదాలు జగన్‌మోహన్‌రెడ్డి, మీపై మాట్లాడాల్సి వస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రతి శుక్రవారం కోర్టుకు వెళ్తారని తమ నాయకుడు ఏ రోజు కూడా కోర్టుకుకానీ, జైలుకు గాని వెళ్లలేదని ఎటువంటి అవినీతి అక్రమాలకు చోటివ్వరని నీతి నిజాయితీకి మారుపేరు పవన్‌కళ్యాణ్ అన్నారు. ఒకప్పుడు లారీ క్లీనర్‌గా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు ఎమ్మెల్యే అయి, మంత్రి అయి విపక్షాలపై లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. ఆయన టీ కప్పులు అందించిన విషయాన్ని మరిచిపోయారా గుర్తు చేసుకోవాలన్నారు. ఎప్పుడు ప్రజల పక్షోన పోరాడే ఏకైక వ్యక్తి పవన్ కళ్యాణ్ అన్నారు. గతలో 2014 సంవత్సరంలో టీడీపీ పార్టీని గెలిపించిన వ్యక్తి పవన్‌కళ్యాణ్ అన్నారు. వైసీపీ నాయకులంతా దోపిడీలు, దొంగతనాలు, దౌర్జన్యాలు చేసేది తమ నాయకుడికి రాదని, సినిమాల్లో నటిస్తే తప్పా... అని ప్రశ్నించారు.

## తిరుపతి లోక్ సభ నియోజకవర్గ పరిధిలోని సత్యవేడు నియోజకవర్గంలో మేధోమధనం కార్యక్రమం



చిత్తూరు ( జనస్వరం ) : తిరుపతి లోక్ సభ నియోజకవర్గ పరిధిలోని సత్యవేడు నియోజకవర్గంలో మేధోమధనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో త్వరలో జరగబోయే తిరుపతి ఉప ఎన్నికల గురించి, పార్టీ బలోపేతం గూర్చి చర్చించడం జరిగింది. పిచ్చాట్టూరు మండలం అరణియార్ ప్రాజెక్టు గూర్చి చర్చించి ఎలా ముందుకు వెళ్లాలో నిర్ణయించుకున్నారు. ఈ ప్రాజెక్ట్ ను నవీకరణ చేసి టూరిజం కింద అభివృద్ధి చేస్తే అద్భుతమైన ప్రయోజనం కలుగుతుందని అని అన్నారు. తెలుగు గంగ నీటిని దీనికి అనుసంధానం చేస్తే భవిష్యత్ లో మిగిలిన మండలాలకు నీటి ఎద్దడిని అరికట్టవచ్చు అని జనసేన నాయకులు అన్నారు. అలాగే కెవిబిపురం, వరదయ్యపాలెం, B.N. కండ్రిగ, సత్య వేడు మండలాలలో అరవై వేల మంది జనసంచారం ఉన్నా అంబులెన్స్ సౌకర్యం లేద ని జనసేన పార్టీ తరుపున పోరాడి ఆ ప్రాంతాలకు అంబులెన్స్ సౌకర్యాన్ని తీసుకురావాలని, అందుకు తగిన విధంగా పోరాటం చేసేలా నిర్ణయాలు తీసుకున్నారు. మండల అడహక్ కమిటీ నిర్మాణం మరియు క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్య క్రమం గురించి విశ్లేషణ చేసి గ్రామాల్లో మరింత క్రీయాశీలక సభ్యత్వాలను నమోదు చేయాలని జనసైనికులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు యుగంధర్ పొన్న, జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

## విజయనగరం ఇంచార్జ్ పాలవలస యశస్వి ఆధ్వర్యంలో జనసేన పార్టీలోకి చేరికలు



విజయనగరం ( జనస్వరం ) : విజయనగరం నియోజకవర్గంలో స్థానిక 19వ వార్డులో సుమారు 25మంది యువకులు శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చి జనసేన పార్టీలో శ్రీమతి పాలవలస యశస్వి గారి ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరటం జరిగింది. పాలవలస యశస్వి గారు మాట్లాడుతూ రాజకీయం డబ్బుతో ముడిపడిన వ్యవస్థ అని రాజకీయలవైపు కన్నెత్తి చూడలంటేనే భయపడేవారిని సైతం ఎంతో మంది యువకులకు ఆవకాశం కల్పించిన పార్టీ జనసేన అని అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే యువతలో ప్రశ్నించేతత్వం రావాలని అప్పుడే అవినీతి జరగకుండా పారదర్శకంగా అభివృద్ధి పనులు సక్రమంగా జరుగుతాయని తెలిపారు. నేటి వ్యవస్థ మార్పుకోసం జరుగుతున్న ఉద్యమాల్లో యువతరమే సింహాభాగంగా సాగుతుందని భావి భారత నిర్మాణం యువత చేతుల్లోనే ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కాలేజీ టాపర్ చిన్నమికి రూ.30,000 ఆర్థిక సహాయం




కృష్ణా ( జనస్వరం ) : కృష్ణా కోడూరు మండలంలోని గంగరాజు పోడు పంచాయితీ పరిధిలో ఉన్న కొండారెడ్డిపోడు గ్రామ నివాసి ఆయనటువంటి అనిమాల చిన్నమి అనే విద్యార్థి డిగ్రీ ( Bzc) యోగి వేమన యూనివర్సిటీ నందు మొదటి స్థానం సంపాదించినది. ఉన్నత చదువుల( గ్రూప్ 2 కోచింగ్) నిమిత్తం వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేదు. ఆమె పరిస్థితి తెలుసుకున్న గంగురాజుపోడు జనసైనికులు 30,000 రూపాయిలు ఆర్థిక సహాయం చేయడం జరిగినది. జనసైనికులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎవరికి ఏం కష్టం వచ్చినా ఆదుకునేందుకు జనసేన పార్టీ జనసైనికులు ముందు ఉంటారని అన్నారు. చిన్నమి ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలిసి మా వంతు సహాయం అందించాము. తాను గొప్పగా ఎదిగి మరింత ఉన్నత శిఖరాలకు ఎదిగి సమాజం కోసం తనవంతు సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగరాజుపోడు జనసైనికులు మరియు కోడూరు నియోజకవర్గ జనసేన నాయకులు ముత్యాల కిషోర్ కుమార్, బందలకుంట రవికుమార్, కడవకూటి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజంపేట జనసేనపార్టీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ చదువుతున్న అమ్మాయికి 35,000 రూపాయలు ఆర్థిక సహాయం



రాజంపేట ( జనస్వరం ) : కడప జిల్లా రాజంపేట నియోజక వర్గం రాంనగర్ లో నివసించే ఒక దళిత వర్గానికి చెందిన తల్లి తండ్రి చనిపోయి అత్త మామల సంరక్షణలో నివసించే ఒక అమ్మాయి రేషన్ కార్డ్లో భర్త చనిపోయిన నానమ్మకు ప్రభుత్వ పెన్షన్ వస్తున్న కారణంగా ఫీజ్ రీయింబర్స్ మెంట్ నిరాకరించి దరఖాస్తును చెల్లదని చెప్పారు. కడప అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ చదువుతున్న అమ్మాయి ఆర్థిక స్తోమత లేక అర్హత ఉన్నా రేషన్ కార్డు లోని పొరపాటు వల్ల ఫీజ్ కట్టలేక పోయి చదువు ఆపేయ్యాల్సిన పరిస్థితిలో రాజంపేట జనసేన పార్టీ తరపున ఒక విద్యా సం. కు ఫీజ్ 35,000/- రూపాయలు రామ్ నగర్ లో నివసించే వారి కుటుంబ సభ్యులకు చెక్ రూపంలో అందచేయటం జరిగింది.. అంతే కాకుండా ఫీజ్ రీయింబర్స్ మెంట్ తిరిగి రావడానికి రేషన్ కార్డులో పేరు మార్పు చేయించి కొత్త రేషన్ రావటానికి కూడా జనసైనికులు కృషి చేసి ఈ ప్రక్రియలో కలిగిన అనేక సమస్యల గురించి రాజంపేట జనసేన నాయకులు ప్రభుత్వానికి తెలియ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసైనికుడి కుటుంబానికి ఎన్.ఆర్.ఐ. జనసేన రూ. 4,16,224 ఆర్థిక సాయం



గురజాల ( జనస్వరం ) : గుంటూరు జిల్లా గురజాల నియోజకవర్గంలో ఇటీవల మృతి చెందిన మునగాల రవి కుటుంబానికి ఎన్.ఆర్.ఐ. జనసేన యూ.ఎస్.ఎ. విభాగం అతని అండగా నిలిచేందుకు పార్టీ తరఫున కొంత మొత్తాన్ని సేకరించి పంపారు. మొత్తం రూ. 4,16,224 ను చెక్ రూపంలో సంస్మరణ సభలో పార్టీ నాయకుల చేతుల మీదుగా మృతుని తల్లికి అందచేశారు.

## కొమర్రాజులంక అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించి నిత్యావసర సరుకులు అందించిన కొత్తపేట నియోజకవర్గ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్



తూర్పు గోదావరి ( జనస్వరం ) : తూర్పు గోదావరి జిల్లా, కొత్తపేట నియోజకవర్గంలో రావులపాలెం మండలం యందు కొమర్రాజు లంక గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ద్వారా అగ్ని ప్రమాదం కారణంగా, నందమూరి వీర్రాజు, రజక కులస్తులకు చెందిన రెండు పోర్షన్ల తాటాకు పెద్ద ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో, ఆ కుటుంబానికి చెందిన వారు ఆర్థికంగా, తీవ్రంగా నష్టపోయి పూర్తిగా నిరాశ్రయులైయినారు. వారికి అండగా వారి కుటుంబ సభ్యులను ఓదారుస్తూ, వారి కుటుంబానికి నిత్యావసర వస్తువులను, కూరగాయలను, కిరాణా సామాన్లుతో పాటు బియ్యము, కొంత ఆర్థిక సహాయం అందించారు. ఆగ్రామ, మండల జనసేన సైనికులుతో కలిపి, వారికి ఉడతా భక్తిగా బండారు శ్రీనివాస్ సహాయ సహకారాలు అందించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దహనమైన ఇల్లుని చూసి ఎంతో చలించిపోయిన బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ, వెంటనే ఈ నిరాశలైన అగ్ని ప్రమాద బాధితులను, ప్రభుత్వ అధికారులు వెంటనే ఆదుకోవాలని, రెవెన్యూ, సంబంధిత ఉన్నతాధికారులకి ఫోన్ ద్వారా తెలియజేస్తూ, తక్షణం సహాయ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వము, ఇల్లు కోల్పోయిన అగ్నిప్రమాద బాధితులకు తక్షణం స్పందించి, వెంటనే పక్కా ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరారు. కొమర్రాజులంకలో అగ్నిప్రమాదం జరిగిన వెంటనే కొత్తపేట నియోజకవర్గ జనసైనికులు స్పందించి బాధితులకు అండగా నిలిచారు.

## జనసేన ప్రెస్ నోట్స్

### అయోధ్యలో రామ మందిరం నిర్మిస్తుంటే..ఇక్కడ రాములవారి విగ్రహం ధ్వంసం చేశారు

శతాబ్దాల చరిత్ర కలిగిన రామతీర్థం క్షేత్రంలోని బోధికొండపై శ్రీ కోదండరాములవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని ప్రతి ఒక్కరం ఖండించాలి. స్వామి విగ్రహాన్ని ధ్వంసం చేసిన విధానం... స్వామి శిరస్సు కనిపించకుండా పోవడం తెలుసుకొంటే చాలా బాధ కలిగింది. మన రాష్ట్రంలో గత యేడాదిన్నర కాలంగా దేవతా విగ్రహాలు, ఆలయ రథాలు ధ్వంసం చేస్తున్నారు. అందుకు పరాకాష్టగా రామతీర్థంలోని ఘటన కనిపిస్తోంది.



శ్రీరాముని విగ్రహాన్ని పగలగొట్టి శిరస్సు భాగాన్ని తీసుకువెళ్ళడం ఏదో పిచ్చివాళ్ళ చర్య అనుకూకూడదు. మత మౌఢ్యం తలకెక్కిన ఉన్మాదపు చర్య ఇది. పిఠాపురం, కొండబిట్రగుంట, అంతర్వేది ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి తూతూ మంత్రంగా వ్యవహరించడం వల్లే చారిత్రక ప్రసిద్ధి చెందిన ఆలయంలో దుర్మార్గపు చర్యకు తెగబడ్డారు. ఇప్పటి వరకూ అంతర్వేదిలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి రథం దగ్ధం వెనక ఉన్నవారిని, ఆ నేరానికి పాల్పడ్డవారినీ పట్టుకోలేదు. దేవత విగ్రహాలు, ఆలయ ఆస్తులపై దాడులను ఏ విధంగా చూడాలి? ఇవి మతి స్థిమితం లేనివారి చర్యలు కాదు. మత స్థిమితం లేనివారి పనులుగా భావించాల్సి వస్తోంది.

రామజన్మ భూమి అయోధ్యలో రామ మందిర నిర్మాణం సాగుతున్న తరుణం ఇది. మన రాష్ట్రంలో మాత్రం రాములవారి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. హిందూ ఆలయాలపై దాడులు పెరిగిపోతుంటే ముఖ్యమంత్రి ఎందుకు స్పందించడం లేదు. ఆయనకు ఏ మత విశ్వాసం ఉన్నా పరమతాలను గౌరవించాలి. హిందూ మతంపై ఒక పథకం ప్రకారమే దాడులు సాగుతున్నాయి. అన్యమత పండుగను పురస్కరించుకొని ముఖ్యమంత్రికి పవిత్ర తిరుమల క్షేత్రం నుంచి మంత్రులు శుభాకాంక్షలు చెప్పడం దురదృష్టకరం. శ్రీవారి కొండపై రాజకీయాలు మాట్లాడకూడదు, అన్యమత సంబంధ విషయాలు ప్రస్తావించకూడదు అనే నియమాలను కావాలనే విస్మరిస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో గత యేడాదిన్నరగా దేవాలయాలపై దాడులు చేస్తూ దేవత విగ్రహాలను, రథాలను ధ్వంసం చేస్తున్న ఘటనలపై కేంద్ర హోమ్ శాఖ దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ వరుస సంఘటనలపై సి.బి.ఐ.తో దర్యాప్తు చేయించాలి అని పవన్ కళ్యాణ్ గారు డిమాండ్ చేశారు.

### 5వ తేదీన రామతీర్థ ధర్మ యాత్ర...

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో హిందూ దేవతా విగ్రహాలు, ఆలయ ఆస్తులపై ఒక పరంపరగా సాగుతున్న దాడులకు పరాకాష్ట రామతీర్థం క్షేత్రంలోని శ్రీ కోదండరామ స్వామి విగ్రహం శిరస్సును నరికివేయడం. ఈ దుస్సంఘటన తరువాత కూడా వరుస ఘటనలు చోటుచేసుకొంటున్నాయి. జనసేన, భారతీయ జనతా పార్టీలు ఈ ఘటనలను ఖండిస్తున్నాయి. ఇరు పార్టీలు ఈ నెల 5వ తేదీన రామతీర్థ ధర్మ యాత్ర చేపట్టాలని నిర్ణయించాయి. 5 వ తేదీ ఉదయం 11 గంటలకు జనసేన నాయకులు, శ్రేణులు బి.జె.పి. నేతలతో యాత్రగా తరలి వెళ్ళి ఆలయాన్ని సందర్శిస్తారు. శతాబ్దాల చరిత్ర కలిగిన రామతీర్థంలో బాధాకరమైన ఘటన జరిగితే రాష్ట్ర ప్రభుత్వ స్పందన అత్యంత ఉదాసీనంగా ఉంది. ఎంతో సున్నితమైన ఈ విషయంలో జగన్ రెడ్డి గారి ప్రభుత్వం చేష్టలుడిగి చోద్యం చూస్తోంది. దేవాదాయ శాఖ, ఆ శాఖ మంత్రి ఈ రాష్ట్రంలో వున్నట్టా? లేనట్టా? అంతుబట్టడం లేదు. ఏ ఒక్క మంత్రి బాధ్యతతో వ్యవహరించడం లేదు. అందరూ కలసికట్టుగా వినోదం చూస్తున్నారు. పోలీస్, దేవాదాయ శాఖలు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నాయి. బాధ్యత కలిగిన మంత్రులు ఆలయాలపై జరుగుతున్న దాడులపై చేస్తున్న వ్యాఖ్యలు భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తున్నాయి. రామతీర్థం ఘటనకు ముందు నుంచి పలు ఆలయాల్లో విగ్రహాలను పగలగొట్టారు... రథాలను దగ్ధం చేశారు. ఈ దాడులపై ప్రభుత్వం కఠిన చర్యలు అవలంబించకపోవడాన్ని నిరసిస్తూ రామతీర్థ ధర్మ యాత్రను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నాం. ధర్మ పరిరక్షణ కోసం చేపట్టిన ఈ యాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

### హిందూ దేవతా విగ్రహాల ధ్వంసం ప్రభుత్వ వైఫల్యమే

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో దేవుడి విగ్రహ ధ్వంసంతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ పరిస్థితి నెలకొనడం అత్యంత దురదృష్టకరం. హిందూ ధర్మాన్ని విశ్వసించేవారి మనోభావాలను దెబ్బ తీసే ఘటన రాజమహేంద్రవరంలో చోటు చేసుకొందని తెలిసి ఆవేదనకు లోనయ్యాను. రాజమహేంద్రవరంలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం చేతులను ఖండించడం వేదనకు లోను చేసింది. పాకిస్థాన్ దేశంలో హిందూ ఆలయాలను ధ్వంసం చేసి, విగ్రహాలు పగలగొడుతూ. ఉంటారని చదువుతుంటాం. ఇప్పుడు మన రాష్ట్రంలో హిందూ దేవతా విగ్రహాల ధ్వంసం, ఆలయ రథాల దగ్ధం చూస్తున్నాం. రామనామాన్ని జపించే పవిత్ర భూమి మనది... రామ కోటి సభక్తికంగా రాసే నేల ఇది... రామాలయం లేని ఊరంటూ కనిపించదు మన దేశంలో. రాముణ్ణి ఆదర్శంగా తీసుకొంటూ ఉంటాం. మన రాష్ట్రంలో ఆ భావనలు చెరిపేయాలనుకొంటున్నారా? భద్రాచలం తరహాలో అధికారికంగా శ్రీరామనవమి చేయాలనుకొన్న రామతీర్థం క్షేత్రంలో కొద్ది రోజుల కిందటే కోదండరాములవారి విగ్రహం తలను నరికి పడేసే మత మౌఢ్యం పెచ్చరిల్లడం ఆందోళనకరం. ఈ బాధ భక్తుల మనసుల్లో ఇంకా పచ్చిగానే ఉంది. ఇప్పుడు దేవ గణాలకు సేనాధిపతి అయిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారివిగ్రహం చేతులను నరికేయడం చూస్తే ధ్వంస రచన పరాకాష్టకు చేరుతున్నట్లు అనిపిస్తోంది రామతీర్థం క్షేత్రంలో కోదండ రాముని విగ్రహాన్ని పగలగొట్టడం..అంతకు ముందు పలు చోట్ల విగ్రహాలు ధ్వంసం చేయడం, రథాలను తగలపెట్టడం చూస్తుంటే ఒక పథకం ప్రకారమే ఈ దుశ్చర్యలకు తెగబడుతున్నారు. రాష్ట్రంలో ఒకరి మత విశ్వాసాలను మరొకరు గౌరవించే సుహృద్భావ వాతావరణాన్ని తీసుకురావడంలో ప్రభుత్వం తగిన విధంగా వ్యవహరించడం లేదు. రామతీర్థం క్షేత్రంలో శ్రీ కోదండరాముల వారి. విగ్రహం తలను నరికిన ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందన ఉదాసీనంగా ఉంది. దేవుడితో చెలగాట మాడితే దేవుడే శిక్షిస్తాడు అంటూ చెప్పడం చూస్తే ఈ వరుస దాడులపై ఆయన ఎంత నిర్లిప్తంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి వ్యాఖ్యలు నేరం చేసేవారిని నిలువరించవు సరికదా... మరో దుశ్చర్యకు ఊతం ఇచ్చేలా ఉన్నాయి. ఈ ఘటనలకు ఇతర పక్షాలే కారణం అంటూ అధికార పక్షంవాళ్లు చెబుతున్నారు. మరి వారి చేతుల్లోనే పోలీసు, నిఘా విభాగాలు ఉంటాయి కదా... బాధ్యులను ఇప్పటి వరకూ ఎందుకు గుర్తించి అరెస్టు చేయడం లేదు. దేవుడిపై భారం వేసేసి ఆలయాలను కాపాడే బాధ్యత నుంచి తప్పించుకోవాలని ప్రభుత్వం చూస్తుంది. అంతర్వేది ఘటనపై నిరసన తెలిపినవారిపైనా... అక్కడ ఓ ప్రార్థన మందిరానికి నష్టం జరిగితే ఆఘమేఘాలపై కేసులు పెట్టిన ప్రభుత్వం - హిందూ ఆలయాలు, దేవత విగ్రహాలను ధ్వంసం చేస్తే ఎందుకు దేవుడిపై భారం వేస్తుంది. విజయవాడ అమ్మవారి ఆలయ రథంలో వెండి విగ్రహాల అపహరణ కేసు ఏమైందో ఎవరికీ తెలియదు. పిఠాపురం, కొండబిట్రగుంట కేసులు ఎటుపోయాయో ప్రజలకు అర్థం కావడం లేదు. వరుస ఘటనలు చూస్తుంటే రాష్ట్రంలో దేవాదాయ శాఖ అనేది ఒకటి ఉందా అనిపిస్తుంది. హిందూ దేవాలయాలపై సాగుతున్న దాడులను ఏ మత విశ్వాసాన్ని ఆచరించేవారైనా నిరసించాలి. అన్ని మతాల పెద్దలు ఒక వేదికపైకి వచ్చి విగ్రహ ధ్వంసాలు, రథాల దగ్ధాలను ఖండించాలి. అప్పుడే మత సామరస్యం, లౌకిక వాదం పరిఢవిల్లుతాయి.

### పోలీసులు సున్నిత సమయంలో సంయమనంతో వ్యవహరించలేదు

రామతీర్థం క్షేత్రంలో కోదండరామ స్వామి విగ్రహం తల నరికి వేస్తే భక్తుల మనోభావాలు ఎంతో తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘాతుక చర్యను నిరసించిన వారిపై ఆ క్షేత్రంలో పోలీసులు వ్యవహరించిన విధానం అప్రజాస్వామికంగా ఉంది. భారతీయ జనతా పార్టీ నాయకురాలు శ్రీమతి రెడ్డి పావని గారు సొమ్మసిల్లి పోయే విధంగా పోలీసులు దురుసుగా వ్యవహరించిన తీరు చూస్తే ఆ వ్యవస్థ ఎవరి కోసం పని చేస్తుందో అర్థం అవుతుంది. అధికార పార్టీకి సంబంధించిన రాజ్యసభ సభ్యుడు తమ పార్టీ వాళ్ళతో జెండాలు పట్టుకుని మరీ కొండ ఎక్కుతుంటే సహకరించిన పోలీసులు.. ఈ ఘటనపై నిరసన తెలుపుతున్న వారి గొంతులు నొక్కడం, లాఠీలతో విరుచుకుపడటాన్ని ఖండిస్తున్నాం. ఆలయాలపై దాడులను అరికట్టడంలో విఫలమైన పోలీసు వ్యవస్థ.. దురదృష్టకర ఘటనలను నిరసించే వారిని మాత్రం కట్టడి చేస్తుంది. నిరసన తెలపడం అనేది ప్రజాస్వామ్యంలో ఒక హక్కు. దీనిని కాలరాయాలని, తద్వారా తప్పులను కప్పిపుచ్చుకోవాలని ప్రయత్నం చేయవద్దని పోలీసులకు తెలియజేస్తున్నాను అని పవన్ కళ్యాణ్ గారు తెలిపారు.

## జనసైనిక్ పంచ్

శ్రీనివాస్ కుసుమపూడి ( జనసేన అధికార ప్రతినిధి )

» “కొందరిని కొంతకాలం మోసం చేయొచ్చు... అందరినీ కొంతకాలం మోసం చేయొచ్చు. కానీ, అందరినీ అన్ని వేళలా మోసం చేయడం సాధ్యం కానే కాదు”. చరిత్ర చెపుతోన్న సత్యం ఇదే.

» అధికార మదంతో ఎగిరెగిరిపడుతోన్న ‘బోడిలింగాల బ్యాచ్’ తెలుసుకోవాల్సిన నిజం కూడా ఇదే.

### ధర్మం విచ్ఛిన్నానికే శ్రీరామచంద్ర మూర్తి విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారు

“మూర్తీభవించిన ధర్మం శ్రీరామచంద్రుడు’ అంటూ మారీచుడు అనే రాక్షసుడు రావణాసురుడితో చెప్పాడు. త్రేతాయుగంలో ఒక రాక్షసుడు శ్రీరాముని గుణగణాలను ఉన్నతంగా చెబితే... రాక్షస వారసులెవరో వర్తమానంలో ధర్మ విచ్ఛిన్నానికి ఒడిగట్టారు. ధర్మానికి నిండైన రూపంగా దర్శనమిచ్చే శ్రీరామచంద్రుని విగ్రహాలను ధ్వంసం చేయడం ద్వారా రాష్ట్రంలో హిందూ విశ్వాసాలకు విఘాతం కలిగించే కుట్ర సాగుతోంది. తాజాగా కర్నూలు జిల్లా మర్లబండలో ఆంజయనేయ స్వామి ఆలయ గోపురంపై ఉన్న సీతారామచంద్రుల విగ్రహాలను పగలగొట్టడం దుర్మార్గమైన చర్య. ఈ వరుస ఘటనలను ప్రతి ఒక్కరం ఖండించాలి. గత యేడాదిన్నర కాలంగా రాష్ట్రంలో హిందూ దేవాలయాలకు, విగ్రహాలకు అపవిత్రత జరుగుతున్నా ప్రభుత్వం కిమ్మనకుండా ఉండటం వల్లే మతోన్మాదులు మరింతగా తెగబడుతున్నారు. పొరుగున ఉన్న శత్రు దేశంలో హిందూ దేవాలయాన్ని ధ్వంసం చేస్తే అక్కడి ప్రభుత్వం 45మంది నిందితులను అదుపులోకి తీసుకోవడమే కాకుండా - ఆ ఆలయాన్ని పునర్నిర్మించే బాధ్యత తీసుకొంది. శత్రు దేశం పాటి చర్యలను కూడా శ్రీ జగన్ రెడ్డి గారి ప్రభుత్వం తీసుకోలేదా? శక్తిపీఠం ఉన్న పిఠాపురంలో విగ్రహాల ధ్వంసం ఘటన నుంచి తాజాగా రామతీర్థం, రాజమహేంద్రవరం వరకూ ఇప్పుడు మర్లబండ వరకూ విగ్రహాలను పగలగొడుతున్నా, రథాలను తగలబెడుతున్నా ప్రభుత్వ స్పందన ఉదాసీనంగా ఉంది.

## కళ్యాణదుర్గంలో రోడ్డు సమస్యను పరిష్కరించాలని జనసేన, బీజేపీ పార్టీల ఆధ్వర్యంలో నిరసనలు



కళ్యాణదుర్గం ( జనస్వరం ) : అనంతపురం జిల్లాలో కళ్యాణదుర్గం నుండి బొమ్మగానిపల్లి పల్లి మీదుగా ఉన్న రోడ్ గత ప్రభుత్వం లో మొదలు పెట్టి అర్ధాంతరంగా ఆపేయడంతో రవాణా ఇబ్బందులు ఎదురయ్యాయని జనసేన నాయకులు అన్నారు. అంబులెన్స్ లు కూడా తిరగడానికి ఇబ్బంది పడుతుండటం ప్రజలు పడుతున్న ఇలాంటి ఇబ్బందుల్ని గుర్తించి జనసేన, బీజేపీ పార్టీ లు ప్రజల కష్టాలను స్థానిక మండల అభివృద్ధి అధికారికి విన్నవించడానికి బైక్ ర్యాలీ గా వెళ్లి ఆ రోడ్ ని రెండు నెలల్లో పునర్నిర్మాణం చేపట్టి పనులు మొదలు పెట్టాలని కోరారు. లేదంటే దశల వారిగా ఉద్యమాలు చేపడతామని మరియు బ్రహ్మసముద్రం మండలంలో రోడ్లు లేని ముద్దలపురం వంటి చాలా మారు మూల గ్రామాలకు రవాణా సౌకర్యం కొరకు కొత్త రోడ్ లు కల్పించాలని కోరారు. కళ్యాణదుర్గం నుండి బ్రహ్మసముద్రం వరకు డబుల్ లైన్ అమలు చెయ్యాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జనసేన నాయకులు ముప్పూరి దేవరాజు, ఎర్రిస్వామి, రాజేష్, చక్క సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, కరేగౌడ, సుధాకర్, జాకీర్, షైక్ తార, అంజి, తిప్పేస్వామి, అరుణ్,మహేష్, దాసన్న, గోవింద, రజాక్, క్యాతప్ప, దొనస్వామి తదితర నాయకులు పాల్గొన్నారు.

## బనగానపల్లి పట్టణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ, సమస్యలపై పోరాటం



బనగానపల్లె ( జనస్వరం ) : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈరోజు జనసేన పార్టీఆధ్వర్యంలోపట్టణంలోర్యాలీనిర్వహించడం జరిగింది. జనసేన నాయకులు భాస్కర్, చినబాబు లు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జనసేన మరియు బీజేపీ కూటమి విజయం సాధించడం తధ్యమని పేర్కొన్నారు. స్థానిక సమస్యలను పట్టించుకొని పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు. అలాగే నివర్ తుఫాను వలన నష్టపోయిన రైతులకు ఎకరాకు 35000 చెల్లించాలని, లేకుంటే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో త్వరలో అసెంబ్లీ ముట్టడి చేస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా హిందూ దేవాలయాల భద్రత లేదని, రథం కాల్చివేత విగ్రహాల ధ్వంసం జరుగుతుందని, మద్యనిషేధం చేస్తామని గెలిచిన ప్రభుత్వం రెట్టింపు ధరలతో మద్య ఆంధ్ర ప్రదేశ్ గా మార్చారు అని తెలియజేశారు. అప్పు చేసి పప్పు కూడు తప్ప, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కరువయ్యాయి అని తెలిపారు. సామాన్య మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు పుద్వి, శివరామిరెడ్డి, ప్రసాద్, కుళ్ళాయి, నాగేశ్వరెడ్డి, ఖాసీం, పవన్, శంకర్, సంజీవ, సుధాకరెడ్డి, అబ్దుల్ పాల్గొన్నారు.

## వైసీపీ నాయకుల మీద విరుచుకుపడ్డ కువైట్ జనసేన నాయకులు



కువైట్ ( జనస్వరం ) : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కొడాలి నాని పేర్ని నాని సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు అంబటి రాంబాబు దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ పై కువైట్ జనసేన నాయకులు రామచంద్రనాయక్, కంచన శ్రీకాంత్,మాదాసు నరసింహ మండిపడ్డారు. కువైట్ జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వీళ్ళందరూ మాట్లాడుతూ నివర్ తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని పవన్ కళ్యాణ్ కోరితే వ్యక్తిగత విమర్శలు చేస్తూ, దాడికి దిగటం దౌర్భాగ్యమైన చర్య అని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాలపై దాడులు జరుగుతుంటే దుండగులను అరెస్టు చేయలేని హిందూ దేవాలయాలను కాపాడతామని చెప్పలేని అటువంటి మంత్రి దేవాదాయ శాఖ మంత్రి అని, ఒక బూతు కూడా మాట్లాడకుండా ప్రెస్ మీట్ నిర్వహించలేని వ్యక్తి తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి సన్నబియ్యం ఇస్తామని చెప్పి నీ అమ్మ మొగుడు ఇస్తాడా అని చెప్పినటువంటి మంత్రి పౌరసరఫరాల శాఖ మంత్రి అని అన్నారు. రాష్ట్రంలో ప్రధాన రహదారులన్నీ అస్తవ్యస్తంగా ఉంటే రోడ్లకు సంబంధించి ఎప్పుడు కూడా ప్రెస్ మీట్ కూడా నిర్వహించినటువంటి వ్యక్తి అని అన్నారు. జన సేనానిని ఏమైనా అంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## ప్రతి పల్లెకు జనసేన కార్యక్రమంలో పాతపట్నం ఇంచార్జ్ గేదెల చైతన్య



పాతపట్నం ( జనస్వరం ) : ప్రతి పల్లెకు జనసేన కార్యక్రమాన్ని ప్రారంభించి విజయవంతంగా సాగుతున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని శోభనాపురం గ్రామాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఓట్లు కోసం నోటికి వచ్చిన హామీలు ఇచ్చిరెండు సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఎమ్మెల్యే గారు శోభనాపురం గ్రామం వైపు చూడలేదు. 50 ఏళ్ళగా కనీసం మాకు తాగటానికి గుక్కెడు మంచి నీళ్లు ఇప్పించండి అంటూ వేదన చెందారు. అలాగే గ్రామ సమస్యల పరిష్కారానికి గ్రామస్తులు అందరూ ఏకమై శ్రీ పవన్ కళ్యాణ్ గారి భావజాలానికి ఆకర్షితులై, పవన్ కళ్యాణ్ గారే మన సమస్యలు పరిష్కరిస్తారు అనే నమ్మకంతో పాతపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ శ్రీ గేదెల చైతన్య గారి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలంతా జనసేన పార్టీలో చేరడం జరిగింది. చైతన్య గారు వారిని అభినందించారు.

## అగ్ని ప్రమాద బాధితులకి ఆర్థిక సహాయం అందించిన ఎచ్చర్ల నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి శ్రీ కాంతి శ్రీ



ఎచ్చర్ల ( జనస్వరం ) : శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం జి సిగడం మండలంలోని పాలఖండ్యం పంచాయితీ జగన్నాదపురం గ్రామంలో ఒక నిరుపేద వృద్ధ దంపతులు నివాసం ఉంటున్న పూరిల్లు అగ్ని ప్రమాదం సంభవించింది. ఆస్తి నష్టం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఎచ్చెర్లనియోజకవర్గ జనసేన నాయకులు శ్రీమతి క్రాంతి శ్రీ గారు అగ్ని బాధితులకు పరామర్శించి, కొంత డబ్బును అందజేసారు. అలాగే నిత్యావసర సరుకులు కూడా అందించారు. ఎప్పుడు కష్టం వచ్చినా అందుబాటులో ఉంటానని తెలిపారు. మాట్లాడుతూ అలాగే ప్రతీ బాధితులకు ప్రభుత్వం ఆదుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో దుర్గారావు, కాకర్ల బాబాజీ, జి.సిగడాం మండల జనసైనికులు దినేష్, రాజేష్, నర్సుములు, సాయి, అలాగే పాలఖండ్యం జనసైనికులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జన స్వరం
అక్షరమే ఆయుధం
www. Janaswaram.com

## పాఠకులకు మనవి

జనస్వరం ఈ - వార్తాపత్రిక (వార సంచిక) నందు మీ గళమైనవాణినివినిపించాలనుకుంటున్నారా? మీనియోజకవర్గ ప్రాంతంలో జరిగిన సంఘటనలను మన వార్తాపత్రిక నందు పంచుకోవాలనుకుంటున్నారా? మీ సమస్యలను మా పత్రిక నందు విన్నవించుకోవాలని అనుకుంటున్నారా? మీ స్వరంతో ప్రజలకు మరింత చేరువ అవ్వాలంటే మాకు ఈ క్రింది వాటికి పంపించండి.

9642067900

janaswaramnews@gmail.com

జనస్వరం న్యూస్ వెబ్సైట్ మరియు వార్తాపత్రిక మరింత నాణ్యమైన వార్తాప్రపంచాన్ని మీ ముందుకు తీసుకురావడానికి మీ వంతు సహాయంగా ఆర్థికంగా చేదోడుగా నిలవాలని కోరుకుంటున్నాము.

Phonepe/Googlepay

UPI id : janaswaram@ybl